ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పేజీలు : 4 సంపుటి : 01 - సంచిక 183 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ ఆదివారం 06- 10 - 2024 వెల - 2

Digital Edition



L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సంII B.Sc., నర్సింగ్ కోర్స్
పూర్తి వివరములకు:
85200 10739, 85200 23866
జె.లక్ష్మీకాంత రెడ్డి, చైర్మన్



# అంతా..సిండికేట్ !

(ప్రజా రిపబ్లిక్ న్యూస్)-శ్రీకాకుళం

ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు వేళ వ్యాపారులు.. రాజకీయ నేతలకు ఆఫర్ ఇస్తున్నారు. సిండికేట్ అయి ఇరువురుమూ లాభపడదామంటూ ప్రలోభ పెడుతున్నారు. పెద్ద సెంటర్లకు దరఖాస్తులు రాకుండా ఉండేందుకు ప్రణాళిక రచించి.. నేతలకు ముందుగానే మామూళ్లు ముట్టజెబుతున్నారు. మరోవైపు ఇరుపార్టీల కీలక అనుచరులు కూడా కుమ్మక్కై మద్యంషాపుల ఏర్పాటుకు పోటీ తగ్గించేలా ఎత్తుగడ వేస్తున్నారు. ఇలా అంతా సిండికేట్‌గా మారి.. వైన్‌షాపులను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి వ్యాపారులు, రాజకీయ నేతలు సిండికేట్ అవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 'జే' బ్రాండ్ల పేరిట నాసిరకం మద్యాన్ని విక్రయించారు. మందుబాబుల జేబులనూ.. వారి ఆరోగ్యాన్ని గుల్ల చేసేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం విధానాన్ని ప్రక్షాళన చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో టీడీపీ హయాంలో అమలు చేసిన మాదిరి.. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 158 మద్యం దుకాణాలను రెండేళ్ల కాలపరిమితి ఏర్పాటుకుగానూ దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నెల 9 వరకూ ఈ ప్రక్రియ చేపట్టనుంది. 11న శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో దరఖాస్తులను కలెక్టర్ డ్రా తీసి.. దుకాణాలను కేటాయిస్తారు.

-మిగతా2లో

- వైన్‌షాపులను దక్కించుకునేందుకు మాస్టర్‌ప్లాన్
- అధికార పార్టీ నేతలను కలుస్తున్న బడా వ్యాపారులు
- పెద్ద సెంటర్లకు దరఖాస్తులు వేయకుండా ప్రణాళిక
- కుమ్మక్కైన ఇరుపార్టీల నేతల కీలక అనుచరులు
- పోటీ తగ్గించేందుకు ఎత్తుగడ

## సీఎం చంద్రబాబు సీరియస్!



ఉచిత ఇసుకపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశం ఇచ్చారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా జరుగుతున్న దుష్ప్రచారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించే దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని.. తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**ఇటీవల ఇసుకపై కీలక ప్రకటన...**

ఉచిత ఇసుకపై సీఎం చంద్రబాబు ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. డీకేటీ పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు నిబంధనలను గనులశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె.మీనా జారీ చేశారు.

-మిగతా2లో



### కొండా సురేఖ వ్యాఖ్యలపై
## రాహుల్ గాంధీ సీరియస్..

మంత్రి కొండా సురేఖ మీద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీరియస్ అయ్యారు. సమంత మీద చేసిన వ్యాఖ్యలపై ఆయన వివరణ కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధ రాత్రి రాహుల్‌కు కొండా సురేఖ లేఖ రాశారు. లెటర్ చదివాక ఢిల్లీ నుంచి సురేఖపై రియాక్షన్ ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇటీవల సమంత, కేటీఆర్‌లపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శిస్తూ సినీ పరిశ్రమ నటులను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. సమంత, నాగ చైతన్య కేటీఆర్ వల్లే విడాకులు తీసుకున్నారని ఆమె చేసిన వ్యాఖ్యలు మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




### నిన్నటి వరకు డేటా చోరీ..
## నేడు కంటెంట్‌లో కల్తీ..

కుక్కతోక వంకర సామెత సరిగ్గా వైసీపీ అధ్యక్షుడి సొంత పత్రిక సాక్షికి సరిపోతుంది. వార్తల పేరుతో ఇతర పత్రికలు, సంస్థలపై కుట్రలు చేయడం పరిపాటిగా మారింది. తమ అధినేత మెప్పుకోసం పత్రికా విలువలను గాలి కొదిలేసి.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. సాక్షి వెబ్‌సైట్‌లో ప్రచురించే వార్తల్లో కొన్ని ఎంపిక చేసిన వార్తలకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ట్యాగ్‌ను ఉపయోగిస్తోంది. ఏదైనా వార్తను పోస్టు చేసేటప్పుడు దానికి సంబంధించిన ట్యాగ్‌లను ఇవ్వడం సర్వ సాధారణం. ఒక పత్రిక లేదా సంస్థ ఇతర పత్రికలు, సంస్థలకు సంబంధించిన ట్యాగ్‌లను తమ వార్తల్లో ఉపయోగించదు. ఎక్కువ మంది ప్రజలు సెర్చ్ చేసే, ట్రెండింగ్ కీ వర్డ్సను, ట్యాగ్‌లను మాత్రమే ఉపయోగిస్తుంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇతర సంస్థల పేర్లను తమ వార్తల్లో ప్రస్తావిస్తుంది. కానీ సాక్షి వెబ్‌సైట్‌లో పోస్టు చేసే వార్తల్లో ఓ కుట్ర ప్రకారం ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ట్యాగ్‌ను ఉపయోగిస్తోంది. ఎవరైనా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి పేరుతో వార్తలను సెర్చ్ చేస్తే వారికి సాక్షి వెబ్‌సైట్‌లో వార్తలు వచ్చే లా ట్యాగ్‌ను ఉపయోగిస్తోంది. ప్రజల ను, ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్ పాఠకులు, ఏబీఎన్ వీక్షకులను తప్పుదోవ పట్టించేలా సాక్షి

### రథాలకు నూతన హంగులు..
## ఊరేగింపులో ప్రత్యేక సొగసులు



రథాలకు హిందూ సాంప్రదాయంలో పూర్వం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. కొంత కాలం క్రితం విడుదలైన బాహుబలి సినిమా చాలా మంది చూసే ఉంటారు. అందులో బల్లాలదేవుడిగా నటించిన రాణా నడిపే రథం ప్రత్యేకంగా ఉంటుంది. ముందు చక్రాలకు పదునైన ఫ్యాన్ లు అమర్చి ఉంటాయి. రథం కదులుతూ ఉంటే ఎదురుపడినవారిని ఆ పదునైన ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలు చేస్తూ ఉంటుంది. ఇంకా రామాయణం, మహాభారతం వంటి ఇతిహాస గ్రంధాలలో అన్నాతి రాజులు , చక్రవర్తుల ప్రయాణించిన రథాలు చాలా ప్రత్యేకంగా ఉండేవి. ముఖ్యంగా "కపి ధ్వజ"- ఇది అర్జునిడి రథం. ఇక్కడ రథం మానవ శరీరాన్ని సూచిక గా భావిస్తారు. రథం లాగటానికి కట్టిన ఐదు గుర్రాలు ఐదు ఇంద్రియాలు. ఇవి రుచి, చూడటం, వినడం, వాసన చూడటం, స్పర్శను కలిగివుండటం అనే మానవ ఇద్రియ గుణాలకు ప్రతీకలుగా భావిస్తారు. రథ సారథి రథం ను ముందుకు నడపటానికి వినియోగించే పగ్గాలు మానవ మనస్సుకు ప్రతీక. నడిపే వ్యక్తి అంటే డ్రైవర్ మానవ మేధస్సును సూచిస్తే అందులో ప్రయాణీకుడు ఒక వ్యక్తి యొక్క ఆత్మగా భావిస్తుంటారు.

2లో



## డైవర్షన్ పాలిటిక్స్ ఎందుకు?..
## టీడీపీపై వైసీపీ సంచలన ట్వీట్!

లడ్డూ కల్తీపై సిట్ వస్తుంది సమాధానం చెప్పు అంటూ టీడీపీ పెట్టిన ట్వీట్ కు కౌంటర్ ఇచ్చింది వైసీపీ. చంద్రబాబు రాజకీయ పునాదులు అబద్ధాలు, డైవర్షన్ పాలిటిక్సే అని విమర్శలు గుప్పించింది. లడ్డూ వ్యవహారంలో కూడా ఆయన పద్ధతి ఇదే అని ఆరోపించింది. వీటికి సమాధానాలు చెప్పకుండా.. ఈ డైవర్షన్లు ఎందుకు అని టీడీపీ ట్విట్టర్ ఖాతాను ట్యాగ్ చేసింది. "మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు... కనీసం సుప్రీంకోర్టు అబ్జర్వేషన్లకైనా సమాధానం చెప్పు." అని ప్రశ్నలు సంధించింది.

**వైసీపీ విసిరిన ప్రశ్నలు..**

1.లడ్డూల్లో కల్తీ నెయ్యి కలిస్తే.. ఆధారాలెక్కడ?

2.కల్తీ జరిగిందని అనుకున్నప్పుడు లడ్డూలపై ఎందుకు పరీక్షలు చేయించలేదు?

3.ఈవో ఒకమాట, సీఎం ఒక మాట ఎందుకు చెప్పారు? ఆరోపణలున్న నెయ్యిని తిప్పిపంపామని ఈవో, లేదు వాడారని సీఎం%ొ% పరస్పర విరుద్ధ ప్రకటనలు ఎందుకు చేశారు?

4.ఎలాంటి ఆధారం లేకుండా భక్తుల మనోభావాలను చంద్రబాబు ఎందుకు దెబ్బతీశారు?

5.జులై 23న రిపోర్టు వస్తే సెప్టెంబరు 18వరకూ 54 రోజులపాటు ఎందుకు దీని గురించి పట్టించుకోలేదు.

6.అసలు నెయ్యి సరఫరా జరిగింది ఎప్పుడు? చంద్రబాబు పరిపాలనలో కాదా?

7.శాంపిల్లు తీసిన జులై 6, జులై 12 తేదీల్లో నడుస్తున్నది చంద్రబాబు ప్రభుత్వమే కదా? టీటీడీలో ఉన్నది చంద్రబాబు వేసిన ఈవోనే కదా?



## త్యాగానికి ఫలితం ఏదీ?

**నేటికీ పునరావాస గ్రామాల్లో పరిష్కారానికి నోచుకోని సమస్యలు**
**దశాబ్దాలుగా ఇదే పరిస్థితి**
**డీ-ఫాం పట్టాలు ఇచ్చినా హక్కులు దక్కని వైనం**
**ప్రభుత్వ పథకాలు పొందలేని దుస్థితి**

2లో

**తిరుమలగిరి(సాగర్) (ప్రజా రిపబ్లిక్ న్యూస్):** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 23లక్షల ఎకరాలకు కృష్ణా జలాల ద్వారా సాగు నీటిని అందించి బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు 69 ఏళ్ల క్రితం చేసిన భగీరథ ప్రయత్నం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం తో సాకారమైంది. ప్రాజెక్టు నిర్మాణ క్రమంలో కృష్ణా నది వెనుక జలాల్లో ముంపునకు గురైన సుమారు 26 గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిది. మునిగిపోతున్న సారవంతమైన భూములు, కన్నతల్లిలాంటి సొంత ఊరును, ఇంటిని వదిలి కట్టుబట్టలతో మూగ జీవాలను వెంటబెట్టుకొని అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ ప్రాంతాల్లో, కనీస సౌకర్యాలు లేని గుట్టలపై ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. అయితే నేటికీ ఈ పునరావాస గ్రామాలు, తండాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోక అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ప్రధానంగా అప్పట్లో కేటాయించిన అటవీ భూములకు సంబంధించిన డీ-ఫారెస్ట్ భూములపై హక్కులను నేటికీ పొందలేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తిరుమలగిరి(సాగర్) మండలాన్ని రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి ప్రత్యేక బృందాలతో సర్వే చేయిస్తోంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం వస్తుండటంతో భూ సమస్యలపై స్పష్టత ఇస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అంతా.. సిండికేట్!

12 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. కాగా.. ఈ నెల 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఇప్పటివరకూ 23 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వ్యాపారులు, రాజకీయ నేతలు సిండికేట్ అయి.. పెద్ద సెంటర్లకు దరఖాస్తులు రాకుండా ప్రణాళిక చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం రాజకీయ నాయకుల ప్రమేయం లేకున్నా.. తెరవెనుక మాత్రం వారి పాత్ర ఎంతుంటుందో ప్రజలందరికీ తెలిసిందే. నచ్చిన దుకాణాన్ని చేజిక్కుంచుకోవాలంటే సంబంధిత ఎమ్మెల్యే.. అంతకుమించి నాయకుల ప్రత్యేక ఆశీర్వాదం కూడా అనధికారికంగా తప్పనిసరి. ఈ నేపథ్యంలో కీలక నేతల వద్దకు మద్యం వ్యాపారులు పరుగులెడుతున్నారు. దుకాణాలు వారికి దక్కేలా ముందుగానే ముడుపులు, వాటాలు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**– గతం కంటే కమీషన్ ఎక్కువని..**

2014 నుంచి 2019 వరకు మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులు నిర్వహించేటప్పుడు.. వారికి ప్రభుత్వం నిర్దేశించిన ట్యాక్స్ చెల్లించాకనే డ్రా పద్ధతిన దుకాణాలు కేటాయించేవారు. డ్రాలో దుకాణాన్ని దక్కించుకున్నవారికి సేల్‌లో 12శాతం కమీషన్ ప్రభుత్వం ఇచ్చేది. అదికొంత లాభదాయంగా ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. నేరుగా ప్రభుత్వ మద్యం దుకాణాలంటూ.. ఆ పార్టీలోని పెద్ద తలకాయలకు లబ్ధి కలిగేలా చర్యలు చేపట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి.. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. అయితే 'డ్రా'లో దుకాణం దక్కించుకుని... ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని ట్యాక్స్ చెల్లించే వ్యాపారికి ఈ దఫా కమీషన్ పెంచింది. గతంలో 12శాతం ఉండగా.. ఇప్పుడు 20శాతానికి కమీషన్‌ను పెంచింది. ప్రస్తుతం ఇతరత్రా వ్యాపారాలు గందరగోళంగా ఉన్నా.. మద్యం వ్యాపారానికి మాత్రం రోజురోజుకీ గిరాకీ పెరుగుతోంది. దీంతో గతంలో రుచి మరిగిన బడా వ్యాపారులంతా ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెరవెనక ఆర్థిక లావాదేవీల్లో పాల్గొన్నవారు... ఇప్పుడు మద్యం దుకాణాలపై మక్కువ పెంచుకున్నారు. అధికార పార్టీ నేతలను బడా వ్యాపారులు కలసి... అన్నీ తాము చూసుకుంటామని... 'పద్ధతి' ప్రకారం చేసుకుంటామని.. వాటా విషయంలో పేచీలు లేకుండా చెల్లిస్తామని.. అడ్డుతగలకుంటే చాలు అంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. మద్యం వ్యాపారులంతా సమావేశమై.. పోటీలేకుండా ప్రణాళికతో 'సిండికేట్' అవుతున్నారు.

**– ఇరుపార్టీల అనుచరులు కుమ్మక్కు..**

గత ఐదేళ్లు డిష్యూం.. డిష్యూం.. అనుకునేవాళ్లందరూ.. ఇప్పుడు రాజకీయ పగ ప్రతీకారాన్ని విడిచిపెట్టేశారు. వారు అలా సాధుజీవుల్లా మారిపోవడానికి ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటే కారణం. జిల్లాలో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేదు. మొత్తం టీడీపీ, బీజేపీ కైవసం చేసుకుంది. ఇక మద్యం దుకాణాలకు డిమాండ్ పెరిగిన మాట వాస్తవం. నగరం, పట్టణాల్లో ఒక్కో మద్యం దుకాణానికి సంబంధించి రెండేళ్లకుగానూ రూ. 1.36కోట్లు ట్యాక్స్ రూపంలో చెల్లించాల్సి ఉంది. రూరల్ ప్రాంతాల్లో అయితే రూ. 1.16 కోట్లు ట్యాక్స్ కట్టాలి. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో పెద్ద మద్యం షాపులకు.. మరో ప్రాంతానికి చెందిన వ్యాపారులు దరఖాస్తు చేయకుండా టీడీపీ, వైసీపీకి చెందిన కీలక అనుచరులు ఒక్కటయ్యారు. కొన్ని మండలాల్లో రెండు దుకాణాలే ఏర్పాటు కానున్నాయి. వాటికి కేవలం ఆ ప్రాంతానికి చెందిన కీలక నాయకులు, వారి అనుచరులు సిండికేట్ అయ్యి... ఇతరులు దరఖాస్తులు వేయనీయకుండా అంతర్గత కట్టుబాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలను, ఆపై నాయకులను ముందస్తుగా కలిసి.. వారి ఆశీస్సులు అందించాలని కోరుతున్నారు. ప్రతి మండలంలోనూ దుకాణాలు కైవసం చేసుకునేందుకు.. పోటీ లేకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో దరఖాస్తులు తగ్గాయనే వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ నేతలు మద్యం దుకాణాల ఏర్పాటుపై నిఘా సారించి.. ఆరోపణలు, విమర్శలు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని జిల్లావాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం చంద్రబాబు సీరియస్!

**ఇల్లు కట్టుకునేవారికి గుడ్ న్యూస్..**

ఏపీలో ఇల్లు కట్టుకునే వారికి దసరా పండుగ సమీపిస్తున్న క్రమంలో చంద్రబాబు సర్కార్ తీపి కబురు అందించింది. ప్రస్తుతం ఇసుక కోసం ఇక్కట్లు పడుతున్న వారికి కాస్త ఊరటనిచ్చే వార్తను చెప్పింది. ఈ నెల 15 నుంచి ఇసుక రీచ్‌లలో పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. అక్టోబర్ 15 నుంచి ఏపీలో ఇసుక కొరత ఉండదని అన్నారు. 15 నుంచి అందరికీ ఇసుక అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. వానాకాలంలో వస్తున్న వరదలను దృష్టిలో ఉంచుకొని గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లలో తవ్వకూడదని ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల మేరకే రీచ్‌లలో ఇసుక తవ్వకాలను నిలిపివేసినట్లు ఆయన వివరణ ఇచ్చారు.

## రథాలకు నూతన హంగులు..

## ఊరేగింపులో ప్రత్యేక సొగసులు

కురుక్షేత్రం యుద్ధం సమయంలో హనుమంతుడు అర్జునుని రథ జెండాపై యుద్ధ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఉన్నాడు. అందుకే ఇప్పటికి విజయానికి గుర్తుగా చాలామంది తమ ఇల్లు, భవంతులపై హనుమంతుడి జెండాను ఎగుర వేస్తారు. మహాభారత యుదంలో కర్ణుడు రథం భూమిలోకి కూరుకు పోతుంటే దాన్ని బయటకు తీసేందుకు కర్ణుడు విశ్వప్రయత్నం చేసాడు. అది బయటకు రాకపోవటానికి భూదేవి శాపంగా చెబుతుంటారు. ఇక పూరిలో జరిగే జగన్నాదుడి రథయాత్ర చాలా విశేషంగా చెప్పుకోదగినిది.

ఇలా పౌరాణికాలు, ఇతిహాసాల్లో పేర్కున్న చాలా పాత్రల్లో వారు వదిన ఆయుధాలకు, ప్రయాణించిన వాహనాలు అంటే రథాలకు చాలా పేర్లు ఉన్నాయి. వాటికీ ఆయా పాత్రను బట్టి, రథానికి ఉన్న లక్షణాలను బట్టి విశిష్టతలను కూడా చెప్పారు. పూర్వం ఎక్కువగా రథాలను అశ్వాలు లాగేవి. తరువాత ఉత్సవాల సమయంలో దేవుడు ఊరేగే సమయంలో ఆయన రథాలను ఏనుగులతో లాగిస్తారు . ఇక భగవంతుడి సేవలో భాగంగా భక్తులు సైతం రథాలు లాగటం చాలా సందర్భాల్లో చూస్తూనే ఉన్నాము.

# త్యాగానికి ఫలితం ఏదీ?

**నాగార్జునపేటతండా**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ కాలంలో బతుకుదెరువుకు కూలి చేసుకుంటున్న వందలాది మంది గిరిజన రైతులకు అప్పటి కమ్యూనిస్టు నేత పరంధామయ్య చేసిన పోరాట ఫలితంగా మనుబోతుతండా (ప్రస్తుత నాగార్జునపేటతండా) వద్ద జీవనోపాధికి సర్వే నెం. 12లో 400 ఎకరాల ఫారెస్ట్ భూమిని డీ-ఫారెస్టగా మార్చి జీవో నెం. 2204 ప్రకారం సుమారు 137మంది గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు అందజేసింది. అప్పట్లో రైతులు సేద్యం చేసుకుంటున్న భూముల విస్తీర్ణం ప్రకారం సర్వే చేసి పట్టాలు ఇచ్చారేగాని వారు ఏ సర్వే నెంబర్లలో సేద్యం చేస్తున్నారనే అంశాన్ని గుర్తించకుండా, హద్దులను నిర్ణయించకుండా డీ-ఫాం పట్టాలు జారీ చేశారు. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని అమలు చేసే క్రమంలో ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సంయుక్తంగా సర్వే నిర్వహించగా, సగం మంది రైతులు సర్వే నెం. 12లో, మిగిలిన రైతులు సర్వే నెం. 32లో కాస్తులో ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దు వివాదం ఎనిమిదేళ్లగా సాగుతూనే ఉంది. 1970లో సర్వే నెం. 12లో డీ-ఫాం పట్టాలను తండా రైతులకు ఇచ్చామని, కాని కొందరు రైతులు సర్వే నెం. 32లో సేద్యం చేస్తుండడంతో వారికి హక్కులు ఇవ్వలేమని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. స్థానిక రైతులు మాత్రం పునరావాసం కింద సర్వే నెం. 12లోనే ప్రభుత్వం భూములు ఇచ్చిందని, అప్పట్లో సంబంధిత అధికారులు హద్దులను నిర్ధారించకపోవడంతో జరిగిన తప్పిదానికి తమ కు డీ-ఫాం పట్టాలతో కూడిన పూర్తి హక్కులు రాకుంటే నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెం. 32లో సేద్యం చేస్తున్న తమకు పూర్తిస్థాయి హక్కులను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**పాస్‌పుస్తకాలు లేకపోవడంతో అన్నీ కోల్పోతున్నాం : ముడావత్ కమిలి, నాగార్జునపేటతండా**

పదేళ్లుగా మా భూములకు పాస్‌పుస్తకాలు లేవు. దీంతో వ్యవసాయ రుణాలు, రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా, ఇలా అన్నింటినీ కోల్పోతున్నాం. పూర్వం సర్వే నెం. 12లో డీ-ఫాం పట్టా భూములను ఇచ్చారు. కానీ, ఇప్పుడు అధికారులు సగం భూములు సర్వే నెం. 12లో, సగం సర్వే నెం. 32 ఫారెస్టలో ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికీ ఐదుసార్లు సర్వే చేశారు. ఏం తేల్చట్లేదు. సమస్యను పరిష్కరించట్లేదు.

**గట్టు మీదితండా**

సాగర్ ప్రాజెక్టు ముంపునకు గురైన గుమ్మడంతండా వాసులను నేతాపురం శివారులోని ప్రస్తుత గట్టుమీదితండాకు తరలించారు. కానీ గట్టు ఎక్కడానికి సరైన రహదారి లేక, తాగునీటి కోసం గుట్ట కిందికి కిలోమీటరు దూరం నడవాల్సి రావడం, సేద్యం చేసుకునేందుకు భూములు అనుకూలంగా లేకపోవడంతో కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. ఇక్కడే ఉన్న రైతులు వారికి కేటాయించిన భూములను సర్వే చేయించుకొని రెవెన్యూ రికార్డులో నమోదు చేయించుకున్నారు. అయితే వలసల నుంచి తిరిగి వచ్చిన మిగిలిన రైతుల భూములు సర్వే నిర్వహించకపోవడంతో ప్రభుత్వం ఇచ్చిన డీ-ఫాం పట్టాలను మాత్రమే రైతులు దాచుకున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో తండాలోని గుడిసెలన్నీ పూర్తిగా దగ్ధం కాగా, వారు దాచుకున్న డీ-ఫాం పట్టాలు కాలిపోయాయి. దీంతో వారి వద్ద ఆధారాలు లేక రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదుకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 1,330 ఎకరాలకు 290 ఎకరాల భూమి మాత్రమే రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. మిగిలిన రైతుల వివరాలు రికార్డుల్లో లేకపోవడంతో భూములను సేద్యం చేస్తున్న రైతులకు ఫారెస్ట్ అధికారులు తరుచూ ఆటంకాలు కలిగిస్తున్నారు. ఈ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోంది.

**కన్నీళ్లు పెట్టుకుంటూ ఇక్కడికి వచ్చాం : రమావత్ బాబ్లా, గట్టుమీదితండా**

సాగర్‌నీళ్లు మమ్మల్ని ముంచినా ఇక్కడి నుంచి పోయేది లేదం టూ మొరాయించాం. ఉన్న ఊరు, భూములను, ఆస్తులను వదిలిపెట్టలేక తల్లడిల్లాం. డ్యాం కట్టడంతో నీళ్లు మా గ్రామానికి వస్తుండడం తో గట్టుపైకి చేరి మునుగుతున్న మా ఊరిని చూసి కన్నీళ్లు పెట్టుకున్నాం. గత్యంత రం లేక ప్రభుత్వం చెప్పినట్లుగా ఇక్కడికి వచ్చాం. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అయితే నేటికీ మేం కష్టపడి సేద్యం చేసుకున్న భూములకు పట్టాలు పొందలేకపోతున్నాం.

**గోదుమడకజి**

సాగర్ జలాల్లో ముంపుకు గురైన గ్రామస్థులకు అప్పటి ప్రభుత్వం ప్రస్తుత గోదుమడక వద్ద పునరావాసం కల్పించింది. సేద్యానికి అనువుగా లేని ఫారెస్టలో సర్వే నెం. 14, 39లో డీ-ఫారెస్ట్ పట్టాలను బాధితులకు అందజేసింది. అయితే 2008 నుంచి రెవెన్యూ రికార్డుల్లో డీ-ఫారెస్ట్ భూములకు (పట్టా భూములు) బదులుగా లావుణి పట్టా (ప్రభుత్వ భూమి)గా నమోదు చేశారు. దీంతో వారు తమ అవసరాల నిమిత్తం భూమిని విక్రయించాలన్నా, వారసత్వ బదిలీ చేసుకోవాలన్నా వీలుకాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పలు పునరావాస గ్రామాల్లో డీ-ఫారెస్ట్ భూముల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ ద్వారా జరుగుతున్నా, ఇక్కడ మాత్రం ఆ అవకాశం లేకుండా పోయింది. సాగర్ ముంపులో ఎంతో విలువైన పట్టా భూములు కోల్పోయామని, కానీ పేరుకు డీ-ఫాం పట్టాలు ఇచ్చినా వాటిపై పూర్తి హక్కులు పొందలేకపోతున్నామని ఇక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పునరావాసంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం : పందిరి మారయ్య, గోదుమడక**

సాగర్ జలాల ముంపుతో అర్ధాంతరంగా మా గ్రామస్థులను ప్రభుత్వం ఇక్కడికి పునరావాస కేంద్రాలకు తరలించింది. అప్పట్లో ఇక్కడ సరైన రోడ్లు లేక, తాగేందుకు నీళ్లు లేక, ఉండడానికి సరైన ఇల్లు లేక, సేద్యం చేసుకునేందుకు అనువైన భూములు లేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యాం. అప్పట్లో మా సొంత గ్రామంలో సారవంతమైన పట్టా భూములను కోల్పోయాం. ఇక్కడికి వచ్చాక డీ-ఫాం పట్టాలు ఇచ్చినా రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. దీంతో మా భూములకు విలువ లేకుండాపోయింది.

**చెన్నాయిపాలెం**

సాగర్ ముంపునకు గురికావడంతో కొందరు గిరిజన రైతులకు చెన్నాయిపాలెంలో పునరావాసం కల్పించారు. వారికి 1970లో సర్వే నెం. 39లో డీ-ఫారెస్ట్ పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి సంబంధిత రైతులు ఆ భూములను సేద్యం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే 2008 నుంచి ప్రభుత్వం జారీ చేసిన డీ-ఫారెస్ట్ భూములను రెవెన్యూ అధికారులు లావుణి పట్టా, ఫారెస్ట్ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో చేర్చారు. దీంతో ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూ వ్యవసాయానికి ఆటంకం కలిగిస్తున్నారని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సుంకిశాలతండా**

సాగర్ ముంపు గ్రామమైన పూర్వ సుంకిశాల తండాకు చెందిన గిరిజనులను 1970లో ఎల్లాపురం గ్రామ సమీపంలోని గుట్టలపై పునరావాసం కల్పించారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన గిరిజనులకు గుట్టపైనే సర్వే నెం. 255లో డీ-ఫారెస్ట్ పట్టాలను జారీ చేశారు. తదనంతరం కుటుంబాలు పెరిగే కొద్ది స్థానిక గిరిజనులు జీవనోపాధి కోసం పోడు వ్యవసాయం చేశారు. దీంతో 2005-06లో అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో 111 మందికి ఆర్ఓఎఫఆర్ పట్టాలు జారీ అయ్యాయి. తదనంతరం బీఆర్ఎస్ హయాంలో 2022లో తాత్కాలిక అటవీ హక్కు పత్రాలను 70 మందికి అందచేశారు. అయితే వారు సేద్యం చేసుకుంటున్న భూములకు ఆన్‌లైన్‌లో 1-బీ, పహాణీలు రాకపోవడంతో సంబంధిత రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, రుణమాఫీ పొందలేకపోతున్నారు. అదేవిధంగా ప్రభుత్వానికి సంబంధించిన పలు ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. సేద్యం చేసుకుంటున్న క్రమంలో ఫారెస్ట్ అధికారులు ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. తండా నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, జానారెడ్డి మంత్రిగా ఉన్న హయాంలో కొంపల్లి నుంచి గట్టుమీదితండా వరకు రోడ్డును ఏర్పాటు చేశారని, ప్రస్తుతం అది గుంతలమయంగా మారి ఇబ్బందులకు గురవుతున్నామని గిరిజన వాసులు వాపోతున్నారు. పునరావాస గ్రామమైన సుంకిశాలను దత్తత తీసుకుంటున్నట్లు అప్పటి మంత్రి జగదీషరెడ్డి ప్రకటించినా, ఆశించిన అభివృద్ధి, సమస్యలకు పరిష్కారం దొరకలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

**కాందిశీకుల భూములకు హక్కులు దక్కేనా?**

స్వాతంత్ర్యం అనంతరం మండల పరిధిలోని కృష్ణపట్టెలో ఉన్న రైతులు ఎన్నో ఏళ్లుగా కాందిశీకుల భూములను సేద్యం చేస్తున్నారు. చింతలపాలెం రెవెన్యూ శివారులోని సర్వే నెం. 16, 28, 52, 60, 70, 204, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారులోని సర్వే నెం. 24, 38లో కలిపి మొత్తం 2,871.14 ఎకరాల విస్తీర్ణంలో ఈ భూములు ఉన్నాయి. ఈ భూములు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని హెూం మంత్రిత్వశాఖ ఆధీనంలో ఉండడంతో కాస్తులో ఉండి సేద్యం చేస్తున్నా, రైతులకు గత ప్రభుత్వా లు హక్కులను కల్పించలేకపోయాయి. కృష్ణానదికి ఆనుకోని బండరాళ్లతో బీడుగా ఉన్న భూముల ను గిరిజనులు, స్థానికులు స్వశక్తితో సేద్యంలోకి తెచ్చుకున్నారు. అయితే కాస్తు కబ్జాలో ఉన్న రైతులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా తాత్కాలిక హక్కులు కల్పించారు. దీంతో సంబంధిత రైతులకు బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు అం దాయి. అయితే కాలక్రమేణా కాందిశీకులు భూములు కలిగిన సర్వే నెంబర్లలో వాస్తవ విస్తీర్ణం కంటే రికార్డుల్లో ఎక్కువగా నమోదు కావడంతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేసే సమయంలో ఆర్ఎసఆర్‌ను మించి ఉన్న సర్వే నెంబర్లను గుర్తించి పార్ట్-బీలో చేర్చారు. దీంతో రైతులు తమకు హక్కులు కల్పించాల్సిందిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులను, నాయకులను, ఉన్నతాధికారులను కలిసి వినవ్నవించినా, భూ సర్వే చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం 2004లో కాందిశీకుల భూములకు హక్కులను కల్పించేందుకు ప్రత్యేకంగా తెచ్చిన జీవో ఆధారంగా తమకు శాశ్వ త హక్కులు కల్పించాలని సంబంధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలాన్ని రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన క్రమంలో తమకు న్యాయం రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో శనివారం పర్యటించనున్నారని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉదయం 8.30గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11గంటలకు తిరుమలగిరి(సాగర్) మండలం నెల్లికల్ గ్రామం చేరుకుంటారని తెలిపారు. అక్కడ ధరణికి సబంధించిన రైతులు, సంబంధిత అధికారులతో ముఖాముఖి స మావేశమవుతారని పేర్కొన్నారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.30గంటలకు నాగర్జునసాగర్ వద్ద ఉన్న విజయవిహార్ అతిథి గృహానికి చేరుకొని సంబంధితశాఖల అధికారులతో ధరణి పైలట్ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తారని, 3.30గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తారని తెలిపారు.

## నిన్నటి వరకు డేటా చోరీ..

# నేడు కంటెంట్‌లో కల్తీ..

ఓ పెద్ద కుట్రకు తెరలేపింది. ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్‌కు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి.. సంస్థ ట్రాఫిక్ పెరగకుండా ఉండేందుకు.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సాక్షి పనిగట్టుకుని కుట్రలకు పాల్పడుతుందనే విషయం స్పష్టమవుతోంది.

**వంకర బుద్ధి..**

తాజావార్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు అందించడంలో ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్ ముందువరుసలో ఉంటుందన్న విషయం ప్రజలందరికీ తెలిసిందే. తాజా వార్తలు, సమకాలీన రాజకీయ వార్తల కోసం తెలుగువారంతా ఎక్కువగా వీక్షించే వెబ్‌సైట్లలో ఆంధ్రజ్యోతి తెలుగు వెబ్‌సైట్ ఒకటి. ఇటీవల కాలంలో ఆంధ్రజ్యోతికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని సాక్షి.. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ట్యాగ్‌తో తన ట్రాఫిక్‌ను పెంచుకునేందుకు కుట్ర పన్నిందనే అనుమానాలు కలుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి సంస్థపై సాక్షి తప్పుడు ప్రచారం చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ప్రజలకు వాస్తవాలు తెలుసనే కారణంతోనే సాక్షి తప్పుడు వార్తలు, కుట్రలపై పెద్దగా స్పందించలేదు. కానీ రోజురోజుకు సాక్షి వికృత చేష్టలు ఎక్కువైపోతున్నాయి. ప్రజలను తప్పుదోవపట్టించేందుకు అవసరం లేకున్నా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ట్యాగ్‌లైన్‌ను ఉపయోగిస్తూ సంస్థకు వ్యతిరేకంగా కొన్ని వార్తలను ప్రచురించి.. వాటిని బలవంతంగా ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోంది.

**ఇప్పటికైనా మారతారా..**

పోటీప్రపంచంలో తన వెబ్‌సైట్‌కు వీక్షకులను పెంచుకునేందుకు, ప్రజలను ఆకట్టుకునేందుకు ఏదైనా సంస్థ ప్రయత్నం చేయడంలో తప్పులేదు. కానీ ఇతర సంస్థలపై కుట్రలు, కుతంత్రాలు పన్నడం ఎందుకు. ఇతరులపై బురద జల్లినంత మాత్రన..సాక్షిపై ప్రజలకున్న దురాభిప్రాయం పోదు. ఇప్పటికైనా సాక్షి తన వంకర బుద్ధిని మార్చుకుని.. ప్రజల మనసులను గెలుచుకునే ప్రయత్నం చేయాలి కానీ.. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై కుట్ర చేయడం ద్వారా ఏమి సాధించలేదు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ట్యాగ్‌ను దురుద్దేశ పూర్వకంగా ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. భవిష్యత్తులో ఇలాంటి కుట్రలకు పాల్పడితే చట్టపరంగా చర్యలకు వెనుకాడమని తెలియజేస్తున్నాము.

# మందులు అందుబాటులో ఉంచాలి

**పశువైద్యశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్నరైతులు**

**- పశువైద్యశాల ముందు రైతుల నిరసన**



మానవపాడు, అక్టోబరు 5 (రిపబ్లిక్ న్యూస్):–: గ్రామాల్లో పశు సంపద పెంచాలని, దీనికి ప్రతీ రైతు కృషి చేయాలని ప్రభుత్వం ప్రకటనలు జారీ చేస్తోంది.. కానీ పశువులకు రోగాలు వస్తే మాత్రం మందులు పంపిణీ చేయడం లేదని రైతులు వాపోయారు. మందుల పంపిణీ కోసం శనివారం మండల కేంద్రంలోని పశు వైద్యశాల ముందు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ప్రతీరోజు పశువులకు అనేక రోగాలు సంభవిస్తున్నాయి.. ఎద్దులకు ప్రస్తుత వాతావరణం కారణంగా లివర్ నొప్పులు, నట్టల సమస్య, రోడ్లపై నడిచి కాళ్ల నొప్పులతో జీవాలు ఇబ్బందులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి పశువులతో వస్తే మందులు లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారని వాపోయారు. ప్రతీరోజు ప్రైవేటు దుకాణాలకు వెళ్లి మందులను కొనుగోలు చేస్తున్నామన్నారు. మరోవైపు పశువైద్య సిబ్బంది కార్యాలయానికి ఇష్టానుసారంగా వచ్చి పోతున్నారని, ఒక్కోసారి మధ్యాహ్నం వరకే తెరిచి ఉంచుతారని పేర్కొన్నారు. అధికారుల తీరును నిర సిస్తూ కార్యాలయం ముందు రైతులు బైఠాయించారు. జీవాల రోగాల నివారణ కోసం మందులు లేవని చెప్పడం కంటే వైద్యశాలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జేడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మందుల కొరత కు బడ్జెట్ లేకపోవడమే కారణమని, వారం రోజుల్లో వైద్యశాలకు మందులు పంపిణీ చేస్తా మని చెప్పారు. దీంతో శాంతించిన రైతులు చిన్న భీమిరెడ్డి, శివ, మల్లి, రాజు, శరత్, వీరేష్, నాగరాజు, రాముడు అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

# కొలిక్కివచ్చిన తిరువూరు పంచాయితీ..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని తిరువూరు నియోజకవర్గం టీడీపీలో అంతర్గత విబేధాలు సమసిపోయినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారశైలిపై స్థానిక నేతలు అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే తీరుపై అధిష్టానానికి వరసు ఫిర్యాదులు వెళ్లడంతో తిరువూరు పంచాయితీ ఎన్టీఆర్ భవన్‌కు చేరింది. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని, సీనియర్ నేతలు వర్ల రామయ్య, మంతెన సత్యనారాయణ రాజు తదితరులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును పిలిపించి మాట్లాడారు. తన పనితీరు కొందరికి ఇబ్బందులు కలిగిస్తాయని తాను ఊహించలేదన్నారు. తన కారణంగా తలెత్తిన ఇబ్బందులను సరిచేసుకుంటానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హైకమాండ్‌కు తెలిపారు. ఇకనుంచి పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానన్నారు. ఆదివారం తిరువూరులో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం పెట్టాలని నేతలు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొననున్నారు. ఇటీవల తిరువూరులో చోటుచేసుకున్న పరిణామాలపై అధిష్టానం ఎమ్మెల్యే కొలికపూడి వివరణ కోరింది. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎంగా చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారని, చిన్నపాటి సమస్యల వల్ల పార్టీకి చెడ్డపేరు రాకూడదన్నారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల మధ్య సమన్వయం కోసం అందరూ కలిసి ముందుకెళ్లాలన్నారు. తిరువూరులో జరిగే సమావేశంలో అన్ని విషయాలపై సమగ్రంగా చర్చిద్దామన్నారు. పార్టీ శ్రేణులను కలుపుకునిపోతూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆదివారం నాటి సమావేశం జరగనుందన్నారు. ఏ పార్టీలో అయినా చిన్న చిన్న సమస్యలు సహజమని, కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు సమసిపోతాయన్నారు.

## సమన్వయ లోపంతోనే..

తన పనితీరు కారణంగా కేడర్‌తో సమన్వయలోపం ఏర్పడిందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తనకు విషయం ఆలస్యంగా అర్థమైందని, దీంతో చిన్నపాటి పార్టీ నాయకులకు, తనకు మధ్య చిన్నపాటి గ్యాప్ ఏర్పడిందన్నారు. తన కారణంగా ఏర్పడిన సమస్యలను సరిదిద్దుకోవల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. సమన్వయలోపాన్ని సరిదిద్దుకుంటూ ఎంపీ కేశినేని చిన్న నేతృత్వంలో పనిచేస్తామని చెప్పారు. తిరువూరులో టీడీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలిపారు.



## కుటుంబ సమస్య..

ఏ కుటుంబంలోనైనా చిన్నపాటి సమస్యలు తప్పవని తెలుగుదేశం పార్టీ కృష్ణా-గుంటూరు జిల్లాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. తిరువూరు సమస్య కుటుంబ సమస్యవంటిదన్నారు. ఆదివారం జరిగే సమావేశంలో అన్ని సర్దుకుంటాయన్నారు. ప్రతిచోట చిన్న చిన్న సమస్యలు ఏర్పడతాయని, ఆ తర్వాత నాయకులంతా కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సర్దుకుంటాయన్నారు.

## శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం




పాణ్యం (ప్రజా రిపబ్లిక్ న్యూస్): శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల "సిస్టమ్ వెరిఫికేషన్ ఉపయోగించే డిజైన్ మరియు వెరిఫికేషన్" అంశంపై ఒక రోజు గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని ఐ ఈ ఈ ఎస్ పి ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఇలెక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అందించింది. ప్రముఖ వనరుల పనివారుగా సమిస్కో ఎడ్యూ టెక్ హైదరాబాద్ లో వీఎల్ఎస్ఐ ఇంజనీర్ జహూర్ , బెంగుళూరు లో స్మార్ట్‌సాక్ ఇంజనీర్ అఖిల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శాంతిరామ్ ప్రిన్సిపాల్ డాక్టర్ .ఎమ్.వీ.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. హెచ్ఓడీ డాక్టర్ వై. మల్లికార్జున రావు ,కార్యక్రమ సమన్వయకర్తలు ఎస్. రాంబాబు ఏ. అలేఖ్య హిమా బిందు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రజ్ఞాన, వృత్తి పరమైన పరిణామాలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నదని రీసెర్చర్ల ద్వారా స్పష్టీకరించారు.ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇతర సంబంధిత రంగాలలో విద్యార్థులు, ఈ రంగంలో విజయవంతమైన కెరీర్‌లను నిర్మించుకోవచ్చు అనిహెచ్ఓడీ అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన పి. షేక్షావలి రెడ్డి



నంద్యాల అక్టోబర్ 5(రిపబ్లిక్ న్యూస్): ఏపీ జట్టు తరపున జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ జట్టుకు క్రీడా దుస్తులను శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి పంపిణీ చేశారు. శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పరిచయ వేదికలో ఆంధ్రప్రదేశ్ జట్టును పి. షేక్షావలి రెడ్డి పరిచయం చేసుకున్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి, చైతన్యాన్ని నింపేలా వారికి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా పి. షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నంద్యాల జిల్లాలో జరగడం శుభపరిణామమని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని, నవ్యాంధ్ర ప్రదేశ్ కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రెటరీ విజయకుమార్, పిడి శ్రీధర్, పిఈటి సుబ్బారావు ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నంద్యాల అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): పట్టణంలోనిపి ఎస్ సి కె.వి ఎస్ సి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నంద్యాల లో శనివారం ఫ్రెషర్స్ డే జరిగినది ప్రిన్సిపల్ శశికళ మాట్లాడుతూ జూనియర్ సీనియర్స్ బేధాలు లేకుండా ఫ్రెషర్స్ డే ఆనందంగా సంబరాలు చేసుకున్నారు అంతే కాకుండా మా కాలేజీలో విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రాం విద్యార్థులు నైపుణ్యం కనుక్కోవడానికి ఎన్సిసి, ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఎట్లా ముందుకు పోవడానికి ఓరియంటేషన్ ప్రోగ్రాం 11 రోజులు జరుగుతుంది అమ్మాయిలకుహెల్త్ %డ%అవేర్నెస్ గురించి డాక్టర్స్ వారికి ఏ విధంగా ఉండాల్సిందే వారు ఎలా ఉండాలి ఆరోగ్యం గురించి అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అంతేకాకుండాఎమ్మెల్సీ కంపెనీలు జాబ్ మేళా మరియు స్కిల్స్ డెవలప్మెంట్ నిర్వహిస్తున్నాము చాలామందికి మా కాలేజీ నుండి విద్యార్థి విద్యార్థినీలు కు జాబులు ఇవ్వడం జరిగినది అంతేకాకుండా విద్యార్థులకు పోషక పదార్థాలు తీసుకోవడం వల్ల ఎంత ఎనర్జీ వస్తుంది, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థి విద్యార్థినీలకు ఆత్మస్థైర్యాన్ని కోసం కరాటే క్లాసులు నిర్వహించడం జరుగుతున్నది ప్రతి సంవత్సరం మా కాలేజీ నుంచి చాలామంది విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతున్నది ఇప్పుడు కొత్తగా డిగ్రీ విద్యార్థులకు అన్ని కోర్సులకుస్పాట్ అడ్మిషన్ ఇవ్వడం జరుగుతున్నది ఈ అవకాశంలో సద్వినియం చేసుకోవాల్సిందిగా విద్యార్థులను ప్రిన్సిపల్ శశికళ కోరడమైనది

## సంతాన లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు




రుద్రవరం, అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): మండల కేంద్రమైన రుద్రవరం లోని అమ్మవారి శాల నందు సంతాన లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు శనివారం దర్శనమిచ్చింది. శరన్నవరాత్రులలో భాగంగా సంతాన లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దేవీ నవరాత్రులు నవ దుర్గలు సాధన 3. చంద్రఘంట అన్నపూర్ణ దేవి

నంద్యాల అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)

**ప్రార్ధనా శ్లోకము :**

పిండజప్రవరారూఢా చండకోపాస్త్రకైర్యుతా
ప్రసాదం తనుతే మహ్యం చంద్రఘంటేతి విశ్రుతా ?

**. అలంకారము : అన్నపూర్ణ దేవి లేత రంగు**

**నివేదనం : కొబ్బరి అన్నం**

**. మహిమ :**

దుర్గామాత మూడవ నామమైన చంద్రఘంటా స్వరూపం మిక్కిలి శాంతిప్రదము, కల్యాణకారకము. తన శిరస్సుపై అర్ధచంద్రుడు ఘంటాకృతిగా వుండడం వల్ల ఈ నామం ఏర్పడింది. ఈమెని ఆరాధిస్తే సింహపరాక్రమముతో నిర్భయంగా ఉంటారు. జపమాల,ఘంట, బాణం, పదునైన ఖడ్గం, శ్వేత పద్మం, పానపాత్ర, త్రిశూలం, ధనుస్సు, కమలం, గద ధరించి మహాలావణ్య శోభతో ప్రకాశిస్తుంది.

**. చరిత్ర :**

దుర్గామాతయొక్క మూడవ శక్తి నామము 'చంద్రఘంట'. నవరాత్రి ఉత్సవాలలో మూడవరోజున ఈమె విగ్రహానికే పూజాపురస్కారాలు జరుగుతాయి. ఈ స్వరూపము మిక్కిలి శాంతిప్రదము, కల్యాణ కారకము. ఈమె తన శిరమున దాల్చిన అర్ధచంద్రుడు ఘాంటాకృతిలో ఉండటంవల్ల ఈమెకు 'చంద్రఘంట' అనే పేరు స్థిరపడింది.

ఈమె శరీర కాంతి బంగారు వన్నెలో మిలమిల లాడుతుటుంది. తన పది చేతులలో %-% ఖడ్గము మొదలయిన శస్త్రములను, బాణము మున్నగు అస్త్రములను ధరించి ఉంటుంది. సర్వదా సమర సన్నాహయై యుద్ధ ముద్రలో ఉండే దివ్య మంగళ స్వరూపం. ఈమె గంటనుండి వెలువడే భయంకర ధ్వనులను విన్నంతనే క్రూరులైన దుష్టులు గడగడలాడిపోతారు.

నవరాత్రి దుర్గాపూజలలో మూడవ రోజు సేవ మిక్కిలి మహిమోపేతమైనది. ఆ రోజు సాధకుని మనస్సు మణిపూరక చక్రాన్ని ప్రవేశిస్తుంది. చంద్రఘంటా దేవి కృపవలన ఉపాసకునికి దివ్య వస్తు సందర్శనం కలుగుతుందని చెబుతారు. దివ్య సుగంధ అనుభవము కూడా సిద్ధిస్తుంది. అలాగే వివిధాలైన దివ్యధ్వనులు కూడా వినిపిస్తాయి. ఈ దివ్యానుభవ అనుభూతికొరకు, సాధకుడు సావధానుడై ఉండాలి.



ఈ మాత కృపవలన సాధకుని సమస్త పాపాలూ, బాధలూ తొలగిపోతాయి. ఈమె ఆరాధన సద్యః ఫలదాయకము. ఈమె నిరంతరమూ యుద్ధసన్నద్ధురాలై ఉన్నట్లు దర్శనమిస్తుంది కనుక భక్తుల కష్టాలను అతి శీఘ్రముగా నివారిస్తుంది. ఈ సింహవాహనను ఉపాసించేవారు సింహసదృశులై పరాక్రమశాలురుగా నిర్భయులుగా ఉంటారు. ఈమె ఘాంటానాదము సంతతము భక్తులను భూతప్రేతాది బాధలనుండి కాపాడుతూ ఉంటుంది. ఈమెను సేవించినంతనే శరణాగతుల రక్షణకై అభయఘంట ధ్వనిస్తూ ఉంటుంది.

ఈ దేవీ స్వరూపము దుష్టులను అణచివేయటంలో, హతమార్చుటంలో అను క్షణమూ సన్నద్ధురాలై ఉండునదేబీ అయినప్పటికీ భక్తులకూ, ఉపాసకులకూ ఈమె స్వరూపము మిక్కిలి సౌమ్యముగానూ, ప్రశాంతముగానూ కనబడుతూ ఉంటుంది. ఈమెను ఆరాధించడం వల్ల సాధకులలో వీరత్వ నిర్భయత్వములతో పాటు సౌమ్యతా, వినమ్రతలు పెంపొందుతుంటాయి.

వారి నేత్రాలలోని కాంతులు, ముఖవర్చస్సు, శరీర శోభలు ఇనుమడిస్తూ, సద్గుణములు వృద్ధిచెందుతుంటాయి. వారి కంఠస్వరములలో అలౌకికమైన దివ్యమాధుర్యము రాశిగా ఏర్పడుతుంది. చంద్రఘంటాదేవిని భజించేవారు, ఉపాసించేవారు ఎక్కడికి వెళ్ళినా వారిని దర్శించిన వారందరూ సుఖశాంతులను పొందుతారు. ఇలాంటి ఉత్తమ సాధకుల శరీరాలనుండి దివ్యమూ, ప్రకాశవంతమూ అయిన తేజస్సు బహిర్గతము అవుతూ ఉంటుంది. ఈ దివ్య ప్రక్రియ సామాన్యులదృష్టికి గోచరించదు. కానీ ఉత్తమ సాధకులూ, వారి అనుయాయులు మాత్రము వీటిని గ్రహించి, అనుభూతిని పొందగలరు.



మనము త్రికరణశుద్ధిగా విధ్యుక్తకర్మలను ఆచరిస్తూ, పవిత్రమైన అంతఃకరణ కలిగి చంద్రఘంటాదేవిని శరణుజొచ్చి, ఆమెను ఉపాసించడానికీ, ఆరాధించడానికీ తత్పరులమై ఉండాలి. అలాంటి ఉపాసన ప్రభావము వల్ల, మనము సమస్త సాంసారిక కష్టములనుండి విముక్తులమై, సహజంగానే పరమపద ప్రాప్తికి అర్హులమవుతాము. నిరంతరమూ ఈ దేవి పవిత్రమూర్తిని ధ్యానిస్తూ మనము సాధనలో అగ్రగణ్యులమవ్వటానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దేవి ధ్యానము మనకు ఇహపర లోకాలలో పరమ కల్యాణదాయకమై సద్గతులను ప్రాప్తింపజేస్తుంది.

### గ్రామ కట్టుబడి ఉండాల్సిందే కానీ.. నిరుపేదల జీవనాధారం అవసరమే?

**మూడు రోజులుగా బందెలదొడ్డిలోనే మూగజీవాలు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్**




బండి ఆత్మకూరు,అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):- ఏగ్రామంలోనైనా ఆ గ్రామ ప్రజలు గ్రామ కట్టుబాటుకు లోబడి నడుచుకోవాల్సిందే ? ఎందుకంటే గ్రామ పెద్దలందరూ కలుసుకొని గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారంతో తమ వంతు బాధ్యతగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొని కట్టుబాట్లు అమలు చేస్తూ ఉంటారు.అయితే అదే గ్రామ కట్టుబాట్లే కొందరి నిరుపేదలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇలాంటి సమస్య ఇప్పుడు మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ఎదురైంది.గ్రామంలోని కొందరు నిరుపేదలు వ్యవసాయ భూములు లేకపోవడంతో మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు.వీరితో పాటు మరికొందరు పాడి పశువులను జీవనాధారంగా చేసుకొని జీవనం సాగిస్తూ ఉండేవారు. అయితే పంట పొలాలు సాగు చేయడం వల్ల పాడి పశువులను బయటకు వెళ్లకుండా గ్రామ పెద్దలు కట్టుబాటు విధించారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన పుల్లయ్య,మల్లికార్జునలు జీవనాధారం కోసం మేకలు మేపుకునేవారు.వీరు ప్రతిరోజు మేకలు మేపుకునేందుకు వెళ్లడంతో గ్రామ పెద్దలు పంట పొలాలను నష్టం చేస్తున్నాయని మేకలను తీసుకువచ్చి గ్రామంలోనీ బందెలదొడ్డిలో బంధించారని బాధితులు తెలిపారు.మూడు రోజులుగా మేకలు బందెల దొడ్డిలోనే ఉన్నాయని వాటిని విడిపించి తమకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాము పంట పొలాల్లో మేకలు మేపడం లేదని గ్రామ శివారులోని వాగులు,వంకలు,రహదారుల వెంట మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు.కానీ గ్రామ పెద్దలు పంట పొలాలు నష్టం చేస్తున్నాయని నెపంతో తమ మేకలను బందేల దొడ్డికి తీసుకువెళ్లి బంధించారని తెలిపారు.తమ సమస్యల పట్ల ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు న్యాయం చేయవలసిందిగా డిమాండ్ చేశారు.



**నిరుపేదలకు న్యాయం జరిగేలా చూడాలి - వ్యకాసా నాయకులు రత్నమయ్య**

మూడు రోజులుగా బంధించిన మేకలను విడిపించి నిరుపేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.అలాగే పేదలు వ్యవసాయ భూములు లేకపోవడంతో మేకలే జీవనాధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారినీ గ్రామం విడిచి వెళ్ళలనడం విడ్డూరంగా ఉందన్నారు.నిరుపేదల కోసం వెసులు బాటు కల్పించి వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చూపి పెద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

### శ్రీ అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి అమ్మవారు



బండి ఆత్మ కూరు,అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):- నల్లమల అడవి ప్రాంతంలోని ఓంకార క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు శనివారం ఉమాదేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ క్రమంలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లి అక్కడ అన్నపూర్ణాదేవిని దర్శించుకున్నారు.కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ ప్రసాద్ వసతి సదుపాయాలు కల్పించారు.

## అగ్రికల్చర్ విద్యార్థులు కి ఇంటర్నిప్ ట్రైనింగ్...

**చదువు పాఠాలు నేర్పిస్తుంది కానీ వొకేషనల్ మాత్రం జీవితం నేర్పిస్తుంది: ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు..**



రుద్రవరం,అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): ప్రభన్యూస్‌బీ రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు దసరా సెలవుల యందు సమగ్ర శిక్ష వారి సూచనలతో 07 రోజులు పాటు అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతి ప్రియా ఆధ్వర్యంలో

ఇంటర్నెట్ షిప్ వర్క్ చేయడం జరిగింది.దీనిలో భాగంగా జ్యోతి ప్రియా మాట్లాడుతూ శెలవులలో కూడా విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆర్.బి.కె, ఫర్టిలైజర్ దుకాణాలలో అన్ని రకాల మందలు వాటి వినియోగం బయోమాస్, నేల గురించి పలు విషయాలు తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇది ఒక మంచి కార్యక్రమం. ఈ కార్యక్రమాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకుంటే మంచి స్కిల్స్ సాధించుకుంటారు అని అన్నారు.జీవితంలో ఎదగాలంటే



తప్పనిసరిగా కొన్ని స్కిల్స్ సంపాదించుకోవాలి. అలాంటివి ఈ సెలవులను త్యాగం చేసి, వాళ్లు మంచి జ్ఞానాన్ని పొందుతున్నారని అన్నారు. ఆర్ బి కే సెంటర్ వ్యవసాయ అధికారికి వారి సిబ్బందికి ఫర్టిలైజర్స్ దుకాణం యజమానికి సిబ్బందికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్జీఎం కాలేజ్ నందు కంప్యూటర్ సైన్స్ ఏ మామ ఇన్నోవేటివ్

**స్టూడెంట్స్ క్లబ్ ప్రారంభోత్సవ**



నంద్యాల అర్బన్ అక్టోబర్ 4 (రిపబ్లిక్ న్యూస్) ఈరోజు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల నందు కంప్యూటర్ సైన్స్ విభాగం నందు కంప్యూటర్ సైన్స్ ఇన్నోవేటివ్ స్టూడెంట్ క్లబ్స్ ప్రారంభోత్సవం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సి ఎస్ సి విభాగాధిపతి డాక్టర్ కే సుబ్బారెడ్డి గారు ఈ స్టూడెంట్ క్లబ్స్ యొక్క ప్రాధాన్యత గురించి వాటి వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు అవగాహన కలిపించారు . ఈ సందర్భంగా ఈ స్టూడెంట్ క్లబ్ మొదలు పెట్టడానికి కారణమైన విద్యార్థులను అభినందించారు.

సభాముఖంగా అందరు విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ క్లాప్స్ ఉపయోగపడతాయని సూచించారు అదేవిధంగా ఈ సభలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ రామిరెడ్డి గారు విద్యార్థులకు ఇటువంటి క్లబ్స్ వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు అదేవిధంగా ఈ సభలో డీన్ అండ్ ప్రొఫెసర్ డాక్టర్ జి సునీల్ విజయ్ కుమార్ గారూ అలాగే మరో ఒక ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ మధుసూదన రెడ్డి గారు ప్రసంగించారు ఈ




సభలో వివిధ సంవత్సరాలకు సంబంధించిన విద్యార్థులు సి ఎస్ సి భాగంలోని అధ్యాపకులు పాల్గొన్నారు

విద్యార్థులు ఈ క్లబ్స్ ను నిర్వహించడానికి సహకరించిన అధ్యాపకులు పి నవీన్ సుందర్ కుమార్ గారికి ధన్యవాదాలు .

### అకాల వర్షాల పట్ల రైతుల అప్రమత్తంగా ఉండాలి.

**పంట కోత అనంతరం ధాన్యాన్ని సురక్షితప్రాంతానికితరలించండి.. ఏవో పవన్ కుమార్.**

వెలుగోడు అక్టోబర్ ఐదు . రిపబ్లిక్ న్యూస్ వెలుగోడు మండలంలో శనివారం 50.2 మి.మీ వర్షపాతం నమోదైనది వేల్పనూరు గ్రామంలోని మొక్కజొన్న సోయాబీన్ ఫైర్లు ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ అకాల వర్షానికి మొక్కజొన్న పంట కోత అనంతరం పొలం కల్లెంలో ఇతర బహిర్గత ప్రాంతాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న గింజలు తడిసి రైతులకు నష్టం చేరినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. సదరు రైతుల వివరాలు ఉన్నతాధికారులకు పంపుతామని ఏవో తెలియజేశారు .తడిసిన ధాన్యాన్ని వెంటనే ఉప్పు ద్రావణం స్ప్రే చేసుకోవాలని ఏవో పవన్ కుమార్ రైతులకు సూచించారు .పొలాల్లో, కల్లెంలో నీరు నిలవకుండా బయటకు తీసివేయాలని ఏవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏవోతోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది మహేంద్ర స్వర్ణ వేల్పనూరు తలారులు లింగేషు ఈబు పలువురు రైతులు పాల్గొన్నారు.



## అక్రమ మట్టితోలకాల ప్రదేశాన్ని పరిశీలించిన మైనింగ్ అధికారులు

**రుద్రవరం, అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్** మండల పరిధిలోని టి లింగందిన్నె పొలిమేరలో ఉన్న తిప్పపై అక్రమంగా మట్టి తోలకాలు జరిపే ప్రదేశాన్ని మైనింగ్ అధికారులు శనివారం పరిశీలించినట్లు తెలిసింది. కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా రెవిన్యూ తిప్పనుండి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని మట్టి అక్రమ రవాణాను నియంత్రించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. స్పందించిన జిల్లా కలెక్టర్ తిప్పను పరిశీలించి అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్నట్లయితే వెంటనే నియంత్రించాలని ఆదేశించినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు మట్టి అక్రమ రవాణా కొనసాగుతున్న తిప్ప వద్దకు వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్టు తెలిసింది. అనంతరం రుద్రవరం లోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ను కలిసిన మైనింగ్ అధికారులు అక్రమ మట్టి రవాణా నియంత్రణపై చర్చించినట్లు తెలిసింది. ఇప్పటికైనా మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా జరుపుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారుల పైన ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా జరుపుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

## ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన యుగంధర్బాబు






**నంద్యాల క్రైం, అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల ఏఎస్పీగా యుగంధర్బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన ఏఎస్పీగా పదోన్నతి పొందారు. నంద్యాలలో ఏఎస్పీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయనను ఇక్కడే నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## సుందరీకరణ పేరిట దమనకాండ

**ఢిల్లీ అక్టోబర్ 5: (రిపబ్లిక్ న్యూస్)** పూర్తిగా అంపశయ్య మీదున్న కాంగ్రెస్ పార్టీకి జీవం పోసింది మళ్ళీ తెలంగాణనే. ఆ అవకాశాన్ని అధికారాన్ని ఇలా వాడుకోవాలని ప్రయత్నిస్తే, దౌర్జన్యం చేస్తే, ఇప్పుడు మూసీ పరివాహక ప్రాంత ప్రజల శాపాలు, శోకాలు, ఆవేదన, ఆక్రందనలకు కాంగ్రెస్ పార్టీ ఏమైపోతుందో రాష్ట్ర నాయకులు ముఖ్యమంత్రికి తక్షణమే చెప్పాలి. కలలోంచి మేల్కొల్పాలి, ప్రజలతో చర్చించాలి.

ఢిల్లీ నగరాన్ని సుందరీకరించాలనుకున్నాడు నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి తనయుడు సంజయ్‌గాంధీ అంతే, నిర్దాక్షిణ్యంగా పేదలగూళ్ళు తొలగించేశారు. ఎమర్జెన్సీ కాలంలో ఢిల్లీలో జరిగిన ఆ ప్రాంతాల్లో కూల్చివేతలపై మంత్రులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు, జమా మసీద్, తుర్కమన్‌గేట్, కరోల్‌బాగ్ నివాసితులు మూడు వారాలపాటు నిరసనలు చేశాక షా కమిషన్ విచారణలో విచిత్రమైన విషయం బయటపడింది. అది చట్టం, న్యాయం, ధర్మం, అసలు మానవత్వమే లేని కరకు కర్కోటక చర్యని.

తెలంగాణకు ముఖ్యమంత్రి అవడంతోనే మూసీని సుందరీకరించాలనుకున్నాడు రేవంత్‌రెడ్డి. అంతే తెల్లారేసరికి మూసీ పరివాహక ప్రాంతాల్లోకి దండులు, దండులుగా వచ్చేసారు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు. ప్రశాంతంగా ఎవరిళ్ళల్లో వాళ్ళుండి పనులు చేసుకుంటున్న మధ్యతరగతి ఇళ్ళకి, పనులకోసం బయటికెళ్ళిన నిరుపేదల ఇళ్ళకి ఆర్.బి.ఎక్స్ పేరుతో మార్కింగులు వేసుకుంటూ పోయారు. ప్రశ్నిస్తే బుల్డోజర్లు వచ్చి మీ ఇళు ౣ కూల్చేస్తాయి మాట్లాడకండి. మీరు మూసీ నదిని ఆక్రమించి ఇళ్ళు కట్టుకున్నారు అయినా సర్కారు వారు మీ యందు దయతో మీకో బంపరాఫర్ కలిగించారు. మీ అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ అందిస్తున్నారు. కావాలంటే సంతకం పెట్టి సామాన్లు డి.సి.ఎం. వాన్‌లో పెట్టండి, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు కూడా ఉచితం, లేదంటే ఏదీ ఉండదు... వెంటనే తేల్చి చెప్పండి అనే హుకుం. ఇదంతా అక్షర సత్యం. ఇదే జరిగింది. ఇలాగే జరుగుతోంది.

లక్షల రూపాయలతో ఇంటి స్థలాలు కొనుక్కొని, దశాబ్దాల క్రితమే వేలాది రూపాయలతో రిజిస్ట్రేషన్లు చేసుకొని, మున్సిపల్ శాఖ నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది, ఊళ్ళలో ఆస్తులమ్ముకొనో, అప్పులు తెచ్చో, లోన్లు తెచ్చుకొనో ఇళ్ళు కట్టుకున్నారు. కాయకష్టంతో చిన్న స్థలం కొనుక్కొని, అందులోనే రెండు గదులు వేసుకొని ఇంతటి నగరంలో మాకూ ఒక సొంత ఇల్లు ఉందని మురిసిపోతున్న సగటు జీవులకు ముఖ్యమంత్రి కల పీడకలగా మారింది. తిండిలేదు, నిద్రలేదు, ప్రశాంతత లేదు. ఎటువైపు నుంచి బందిపోటు దొంగలు వచ్చి దోచుకుంటారో అని భయాందోళనలకు గురైనట్లు ఎప్పుడు ఏ అధికారులు వస్తారో అని కలవరపాటుకు గురవుతున్నారు మూసీ ప్రాంతవాసులు.

సంజయ్‌గాంధి అప్పుడు వ్యవహరించిన తీరుకి, ఇప్పుడు రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుకి తేడా ఏమీ కన్పించడం లేదు. వాళ్ళు అనుకున్నారు అంతే అయిపోవాలి. మూసీ రివర్ బెడ్ ఎప్పుడు నిర్ధారణ చేశారు ఏ ప్రాతిపదికన చేశారు చెప్పరు. రివర్‌బెడ్ అని వాళ్ళు ఇప్పుడు మార్కింగ్ చేసిన వాటికి మున్సిపల్ అధికారులు ఎందుకు అనుమతులిచ్చారో చెప్పరు. రివర్‌బెడ్‌లో రోడ్లు, విద్యుత్, మంచినీరు ఎందుకు కల్పించారో చెప్పరు. మూసీ నదీగర్భంలోనే ప్రభుత్వం ఆసియాలోనే అతిపెద్ద బస్టాండ్ ఎలా నిర్మించిందో చెప్పరు, చెప్పలేరు కూడా. ఎందుకంటే ఇక్కడి ప్రజల ఇళ్ళవైపు వాళ్ళు ఒక వేలు చూపిస్తుంటే మిగిలిన నాలుగు వేళ్ళు వాళ్ళనే ప్రశ్నిస్తున్నాయి కాబట్టి.

ప్రపంచంలోని నగరాల్లో ఉన్న నదులకు రెండువైపులా నదినీరు జనావాసాల్లోకి రాకుండా ఎత్తయిన, దృఢమైన గోడలు కడతారు. నాడు నగరంగా ఉన్న నేటి పాతబస్తీ ప్రాంతమైన మదీనా, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి, పురానాపూల్, చాదర్‌ఘాట్ వరకూ నాటి నిజాం పాలకులు అలాగే గోడలు కట్టి మూసీకి రెండు వైపులా అందమైన నిర్మాణాలు చేశారు.



# చెంచుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం..ఎమ్మెల్యే బుడ్డా.

**చెంచులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి..కలెక్టర్.**
**హాస్టల్ భవన నిర్మాణం కోసం భూమి పూజ.**



**వెలుగోడు అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్** చెంచుల, గిరిజనుల సంక్షేమం ,అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి అన్నారు .శనివారం నాడు వెలుగోడు పట్టణ జగనన్న కాలనీ సమీపంలో రెండు కోట్ల 70 లక్షల రూపాయలతో నిర్మించనున్న పీఎం జనం పర్టికులర్లీ వేనరబుల్ ట్రైబల్స్ గర్ల్స్ హాస్టల్ భవన నిర్మాణం కోసం కలెక్టర్ రాజకుమారితో కలిసి ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి భూమి పూజ, శిలా ఆవిష్కరణ నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ ,ఎమ్మెల్యే ,డీఈఓ లకు టిడిపి నాయకులు బొకేలు ఇచ్చారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు .ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గిరిజనుల కోసం 48 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని, ఆ పాఠశాలలో ఉన్న వారందరికీ నాణ్యమైన విద్యతోపాటు మంచి పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు .చెంచులు అందరూ చదువుకోవాలన్నదే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. ఈ వసతి గృహంలో 100 బెడ్లు ఉంటాయన్నారు.ఈ హాస్టల్ భవన నిర్మాణం ఆరు నెలల్లో పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తామన్నారు. ఈ హాస్టల్లో గిరిజన బాలికలు ఏ పాఠశాలలో విద్యను అభ్యసించి న ఈ వసతి గృహంలో వసతి పొందవచ్చు అన్నారు.ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి బుడ్డా వెంగల్ రెడ్డి కాలము నుండి కూడా చెంచుల అభివృద్ధి కోసం పాటుపడుతూ వచ్చామన్నారు .తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 56 మంది చెంచులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది అన్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏ ఒక్కరికి కూడా గృహం నిర్మించలేదన్నారు.ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి కూడా రెండు సెట్ల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామన్నారు




.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి ,సంక్షేమం కోసం ప ప్రజల్లో దూసుకెళ్తుంది అన్నారు, ఈ హాస్టల్ భవనాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయడంతో పాటు ఈ వసతి గృహ ఉండే వారందరికీ వాడు చదివే పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి జిల్లా సమన్వయ అధికారి రఘురామిరెడ్డి, ఆర్డీవో దాస్, తాసిల్దార్ శ్రీనివాసులు, విద్యాధికారి బ్రహ్మం నాయక్, తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారపు శశి రెడ్డి, బన్నూరు రామలింగారెడ్డి, అమీర్ హంజా, ఖలీలు ల ఖాన్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, మోమిన్ రసూల్ , రామానాయుడు సయ్యద్ భాష, సంజీవరాయ ప్రసాద్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అన్నం సుబ్బయ్య మృతి

**వ్యవసాయంలో...**
**అన్నం సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం**
**35 సంవత్సరాలు రైతులతో అనుబంధం**
**బలిజ సంఘం ప్రముఖుడిగా విశిష్ట సేవలు**



**నంద్యాల అక్టోబర్5(లిరిపబ్లిక్ న్యూస్):** నంద్యాల కు చెందిన రిటైర్డ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నం సుబ్బయ్య (82) శనివారం ఉదయం మృతి చెందారు. అన్నం సుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. ఒకరు ఏవిఆర్ ప్రసాద్. ఈయన లయన్స్ క్లబ్ సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడిగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఉన్నారు. మరొకరు ఏ.లీలా రమేష్ అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా స్థిరపడ్డారు. ఒక కుమార్తె జి. పద్మజ ఉన్నారు. వ్యవసాయ శాఖలో ఏవోగా, ఏడిఏ గా, డిప్యూటీ డైరెక్టర్ గా అన్నం సుబ్బయ్య విశిష్ట సేవలు అందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జిల్లా కేంద్రమైన కర్నూలులో ఏపీ విత్తన ధ్రువీకరణ విభాగంలో అధికారిగా పనిచేశారు. వ్యవసాయ శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన అన్నం సుబ్బయ్య నంద్యాల, ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం లోని వివిధ మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని రైతులతో మమేకమై తనకంటూ ఒక ప్రత్యేకమైన అనుబంధాన్ని కొనసాగించి లాభసాటి వ్యవసాయంలో మెలకువలను, సలహాలు సూచనలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించారు. 1966 నుంచి 35 సంవత్సరాలు వ్యవసాయ శాఖలో వివాద రహితుడిగా, అత్యంత సౌమ్యుడిగా, రైతులతో మమేకమై వివిధ హోదాల్లో పనిచేసిన అన్నం సుబ్బయ్య 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేయడం జరిగింది. పదవీ విరమణ చేసినప్పటికీ తనతో ఎంతో అనుబంధంగా ఉన్న రైతులతో స్నేహ బంధాన్ని కొనసాగిస్తూ వ్యవసాయంలో



చేయూతను అందిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. వ్యవసాయ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి వందలాది మంది రైతుల ఆదరాభిమానాలు,ఆప్యాయతలు పొందిన అన్నం సుబ్బయ్య ఉమ్మడి కర్నూలు జిల్లాలో బలిజ సామాజిక వర్గం అభ్యున్నతికి కూడా విశిష్ట సేవలు అందించారు.

# హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ విడుదల

**హైదరాబాద్, అక్టోబర్ 5: (రిపబ్లిక్ న్యూస్)** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు అధికారికంగా హైపవర్స్ వచ్చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన హైడ్రా ఆర్డినెన్స్‌కు గర్నవర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. హైడ్రా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్‌పై సంతకం చేసిన గవర్నర్ శనివారం గెజిట్‌ను విడుదల చేశారు.

రాష్ట్రంలోని చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దింపింది. జూలై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి హైడ్రా దూసుకెళ్లింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అనేక అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. అయితే ఈ కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది.

జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షిస్తూ సర్వాధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో అధికారాలను హైడ్రాకు బదలాయించారు. ఈ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. గవర్నర్ వ్యక్తం చేసిన పలు సందేహాలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇప్పటికే వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వివరణలతో సంతృప్తి




చెందిన గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్ ఫైల్‌పై సంతకం చేశారు. ఆపై గెజిట్‌ను విడదల చేశారు. గెజిట్ విడుదలతో హైడ్రాకు ఎదురులేకుండాపోయింది. ఇక చట్టబద్ధత లభించడంతో హైడ్రా మరింత వేగంగా దూసుకుపోనుంది. చెరువులు, నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాల విషయంలో తగ్గేదే లే అన్నట్లు చెలరేగిపోనుంది హైడ్రా.. కేపి

## ఆ కష్టాలకు చెక్!

**ఆదేశాలిచ్చిన సీఎం చంద్రబాబు**
**గత వైసీపీ సర్కారు హయాంలో ఎన్నో ఇబ్బందులు**
**వాటికి తెరదించిన కూటమి ప్రభుత్వం**
**హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు**



**పార్వతీపురం, అక్టోబరు 5(రిపబ్లిక్ న్యూస్):** ధాన్యం విక్రయాల్లో సమస్యలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. రైతులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. వారికి సమీపంలోని ఇష్టమైన మిల్లుకు ధాన్యం తరలించుకునే వెసులుబాటు కల్పించింది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అష్టకష్టాలు పడేవారు. ర్యాండమైజేషన్ విధానం వల్ల దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం రవాణా చేయాల్సి వచ్చేది. దీంతో లేబర్, రవాణా చార్జీలతో రైతులు నలిగిపోయేవారు. కనీసం గోనె సంచులు కూడా గత ప్రభుత్వం సరఫరా చేసేవారు కాదు. అయితే ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం సేకరణలో రైతులకు సాధ్యమైనంత వరకు ఇబ్బందుల్లేకుండా నిబంధనలను సరళతరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గతంలో ఇలా..**

గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ర్యాండమైజేషన్ విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు నానా అవస్థలు పడేవారు. వారికి ఇష్టమైన మిల్లులకు ధాన్యం తరలించలేక పోయేవారు. అప్పట్లో ప్రభుత్వం సూచించిన మిల్లులకే సంబంధిత ఆర్‌బీకే ద్వారా ధాన్యం విక్రయించాల్సి వచ్చేది. గతంలో వైసీపీ నాయకుల సిఫారసులు చెల్లుబాటు అయ్యేవి. అయితే ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రంగ ప్రవేశం చేసి రైతుల వద్ద తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసేవారు. అనంతరం తమ పలుకుబడిని ఉపయోగించి.. ఎక్కువ ధరకు వాటిని ఇతర జిల్లాలకు తరలించేవారు.

**నూతన విధానం...**

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. రైతులు తమకిష్టమైన మిల్లులకు ధాన్యం విక్రయించుకోవచ్చు. ఈ మేరకు అధికారులు వారికి సహకరించాల్సి ఉంది. రైతులకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చనున్నారు. ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ చార్జీలను కూడా చెల్లించనున్నారు. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించనున్నారు. జీపీఎస్ పరికరాలు అమర్చిన వాహనాల ద్వారా మిల్లులకు ధాన్యం రవాణా చేయనున్నారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయనున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

జిల్లాలో ఈ సంవత్సరం రెండు లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది సాధారణ రకం 100 కేజీల ధర రూ.2300, గ్రేడ్-ఏ రకం ధర రూ.2,320గా ధర నిర్ణయించారు. రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని జిల్లాలోని 93 రైస్ మిల్లులకు పంపించనున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో రెండు లక్షల 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు తరలిపోయింది.

**రైతుల ఇష్ట ప్రకారమే..**

జిల్లాలో రైతులు వారికి సమీపంలో ఇష్టమైన మిల్లులకు ధాన్యం విక్రయించుకోవచ్చు. వారికి అవసరమైన సహ కారాన్ని అందిస్తాం. సకాలంలో ధాన్యం కొనుగోలును పూర్తి చేస్తాం.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com